E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 04-06-2025 (వారం) బుధవారం
హైదరాబాద్ పేజీలు–6
e-kaburu.com




మీరేమైనా చరిత్రకారులా?.. కమల్‌హాసన్‌కు కర్ణాటక హైకోర్టు ప్రశ్న » 3లో

## కాంగ్రెస్‌లో తేలని కేబినెట్ విస్తరణ..
### కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో రచ్చ

- రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల్లో అంతర్గత రగడ..
- అసమ్మతి స్వరాలు, అసంతృప్తి జ్వాలలతో సతమతం
- పార్టీ పదవుల లొల్లి.. గాంధీభవన్‌లో మహిళా నేతల ధర్నా
- ఎమ్మెల్సీ కవిత 'రెబెల్స్'తో బీఆర్ఎస్‌లో దుమారం
- జాగృతి బలోపేతమంటూ పార్టీకి సమాంతరంగా కార్యకలాపాలు
- కమలంలోనూ కలహాలు..నేతల్లో కొరవడిన ఐక్యత..
- తలనొప్పిగా మారిన రాజాసింగ్ తీరు

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు. ఒకటి అధికార కాంగ్రెస్, రెండోది ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, మూడవది జాతీయ పార్టీ బీజేపీ. ఏ చిన్న అవకాశం దొరికినా ప్రత్యర్థి పార్టీలపై ఆరోపణలు, విమర్శలతో విరుచుకు పడుతుంటాయి. ప్రజల దృష్టిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. కానీ ప్రస్తుతం.. ఈ మూడు ప్రధాన రాజకీయ పక్షాలూ వేటికవే తమతమ పార్టీల్లో అసమ్మతి స్వరాలు, అసంతృప్తి జ్వాలలు, అంతర్గత కుమ్ములాటలు, విభేదాలతో సతమతమవుతున్నాయి. ఏ పార్టీకి ఆ పార్టీలో లుకలుకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని చెప్పే కాంగ్రెస్ పార్టీలో ఇలాంటివి సహజమే అయినా క్రమశిక్షణకు మారుపేరని భావించే బీజేపీ, ఏకఛత్రాధిపత్యం కింద నడిచే ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్‌లో కూడా రాజకీయ రచ్చ కొనసాగుతుండటం గమనార్హం. అయితే గ్రూపులు, గొడవలకు పుట్టినిల్లు లాంటి కాంగ్రెస్ పార్టీలో రహస్య కొట్లాటలు జరుగుతుంటే, బీజేపీ, బీఆర్ఎస్‌లలో మాత్రం విభేదాలు బహిరంగమవుతుండటం మరో విశేషం. కాంగ్రెస్‌లో పదవులు, ప్రాధాన్యం రభస

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. ఏడాదిన్నరలోనే ప్రభుత్వ పాలన, ప్రభుత్వ.. పార్టీ పదవులు, ప్రాధాన్యత, మంత్రివర్గ విస్తరణ, మంత్రుల వ్యవహారశైలి తదితర అంశాలు చర్చనీయాంశమవుతున్నాయి. అంతర్గత విభేదాలకు, ఫిర్యాదులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణ అంశం ఏడాదిన్నర తర్వాత కూడా కొలిక్కి రావడం లేదు. ఎన్నిసార్లు ఢిల్లీ చుట్టూ తిరిగినా, హైదరాబాద్‌లో చర్చలు జరిగినా తేలడం లేదు.

తరువాయి 2లో



## 18 ఏళ్ల నిరీక్షణకు తెర..
### ఆర్సీబీకి తొలి టైటిల్




ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ తొలి టైటిల్ సాధించింది.

అహ్మదాబాద్: ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ తొలి టైటిల్ సాధించింది. తరువాయి 6లో

## ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలూ అందుబాటులో ఉండాలి.. ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశం



ఈ కబురు: ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగరంలో వర్షా లు, వరదల వంటి పరిస్థితులు తలెత్తినప్పుడు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించడానికి వీలుగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షా లు పడినప్పుడు నగరంలో ట్రాఫిక్‌తో పాటు ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీసు, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. వర్షా కాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారుల సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు.

తరువాయి 2లో

## కంటికి రెప్పలా కాపాడుకుంటా: ఎమ్మెల్సీ కవిత



ఈ కబురు: కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి కుంటుపడుతూ ఆత్మగౌరవం ప్రమాదంలోకి వెళ్తున్న నేపథ్యంలో తెలంగాణ జాగృతి సంస్థ సమస్థవంతంగా పనిచేస్తుందని ఆ సంస్థ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు.

తరువాయి 2లో

## జీ7 నుంచి భారత్‌కు రాని ఆహ్వానం.. ఆరేళ్లలో తొలిసారి!



కెనడాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

ఈ కబురు: కెనాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా ఆహ్వానం అందలేదు. దీంతో ఆరేళ్లలో తొలిసారి ఈ సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్-పాక్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి అమెరికాను అనుమతించిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటేనని పేర్కొంది.

» 2లో



## 24 గంటల్లో 1,430 ఉక్రెయిన్ సైనికులు హతం: రష్యా

**తమ తాజా దాడుల్లో 1,430 మంది ఉక్రెయిన్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.**

ఈ కబురు: ఒక వైపు రష్యాఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం చర్చలకు సన్నాహాలు జరుగుతున్నప్పటికీ మరోవైపు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గత 24గంటల్లో ఉక్రెయిన్‌పై తమ బలగాలు చేసిన దాడుల్లో 1,430 మందికి పైగా ఆ దేశ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కీవ్‌లో డ్రోన్లు, క్షిపణులు, సాయుధ పోరాట వాహనాలు, ఫిరంగి తుపాకులను ధ్వంసం చేశామన్నారు.మరో వైపు మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో తమ సైన్యం దాదాపు 1 మిలియన్ రష్యన్ సైనికులను హతమార్చిందని ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ఆఫీస్ ప్రకటించింది. యుద్ధంలో మొత్తం 9,90,800 మంది రష్యన్ సైనికులు మరణించారని..

తరువాయి 3లో

## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ
» 6లో



## నాగ్‌చిరు అయిపోయారు.. ఇప్పుడు ఆ హీరోతో?
» 5లో



## ఆల్‌టైం గరిష్ఠాన్ని తాకిన బ్యాంక్ నిఫ్టీ.. నష్టాల్లో ముగిసిన సూచీలు
» 4లో



## యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డాలస్ విద్యార్థులతో భేటీ...



ఈ కబురు, హైదరాబాద్: అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న భారతీయ విద్యార్థులకు అండగా నిలుస్తామని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు భరోసా ఇచ్చారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం అమెరికాకు వచ్చిన విద్యార్థులు స్థానిక చట్టాలపై అవగాహన లేకుండా ఏవైనా తప్పులు చేస్తే వారికి బీఆర్ఎస్ అమెరికా విభాగం తరఫున న్యాయ సహాయం చేస్తామని చెప్పారు.అమెరికాకు వర్ధిన విద్యార్థులు ఏదైనా కారణంతో స్వదేశానికి తిరిగి వస్తే ఆ విద్యార్థితో పాటు వారి కుటుంబం కూడా ఎంతో ఆవేదనకు గురవుతుందని, ఈ నేపథ్యంలో భారతీయ విద్యార్థుల్లో మనోధైర్యం నింపేందుకు బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అమెరికాలోని భారతీయ విద్యార్థులు కూడా స్థానిక చట్టాలతో పాటు అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుని మసలుకోవాలని సూచించారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్- డాలస్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులతో కేటీఆర్ మాట్లాడారు. యూనివర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. గతంలో భారతీయులు అమెరికాలో ఉద్యోగాలు, చదువు కోసం ఎన్నో వ్యయ ప్రయాసలు పడేవారని కేటీఆర్ గుర్తు చేశారు. వేగంగా మారిన ప్రపంచ పరిణామాలతో అనేక సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో అమెరికాలో అవకాశాలు కూడా పెరిగాయని అన్నారు. ర్యాంకులు, గ్రేడ్ల కోసం కాకుండా జీవిత లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు.

తరువాయి 2లో



## పోతిరెడ్డిపాడు విస్తరణ, ఎస్సారెమ్సీ లైనింగ్‌ని అడ్డుకోండి

కృష్ణా ట్రైబ్యునల్ అవార్డుకు వ్యతిరేకంగా.. అనుమతులు ఏవీ లేకుండా ఏపీ చేపట్టిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ, రాయలసీమ ఎత్తిపోతలు, శ్రీశైలం కుడి ప్రధాన కాలువ(ఎస్సారెమ్సీ) లైనింగ్, బనకచర్ల రెగ్యులేటర్ పనులను వెంటనే అడ్డుకోవాలని తెలంగాణ కేంద్రాన్ని కోరింది.
» 3లో



## ట్రంప్ గోల్డ్‌కార్డ్.. భారత్‌లో అద్భుత విజయం సాధిస్తుంది! లుట్నిక్

**ట్రంప్ ప్రవేశపెట్టిన గోల్డ్ కార్డ్ భారత్‌లోనూ మంచి ఆదరణ పొందే అవకాశం ఉందని అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ ఆశాభావం వ్యక్తం చేశారు.**
» 3లో

## దేశానికే తలమానికం భూ భారతి చట్టం



ఈ కబురు: దేశానికే తలమానికంగా భూ భారతి రెవెన్యూ చట్టాన్ని ప్రజా ప్రభుత్వం రూపొందించిందని, పేద ప్రజలకు చుట్టంగా భూ భారతి చట్టం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఎర్రుపాలెం మండలం ములుగు మాడు గ్రామంలో భూ భారతి సర్వే, రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. నక్షాలు లేకుండా మన రాష్ట్రంలో 413 గ్రామాల్లో దశాబ్దాల కాలంగా పాలన సాగుతోందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కష్టాలు పడుతున్నారని, భూ భారతి చట్టం ద్వారా 413 గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సర్వే చేయించి సరిహద్దులను నిర్ణయించి ఇబ్బందులు లేకుండా చేయాలని పైలెట్ ప్రాజెక్టు క్రింద ములుగు మాడు గ్రామాన్ని ఎంపిక చేశామని తెలిపారు. దేశ చరిత్రలో చాలా అరుదుగా భూ భారతి వంటి అద్భుతమైన చట్టాలు వస్తాయని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తెలంగాణ టెనెన్సీ యాక్ట్ 1950 ద్వారా పేదలకు భూ హక్కులను కల్పించామని, 1971 ఆర్ఓఆర్ చట్టం, 1973 భూ సంస్కరణల కారణంగా రైతులకు చాలా మేలు జరిగిందని, ఈ చట్టాల కారణంగా భూమి లేని నిరుపేదలకు మిగులు భూమి పంపిణీ చేసి వారికి గౌరవం కల్పించామని అన్నారు. 2020 సంవత్సరంలో బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయని, భూమి హక్కులు లేకపోయినా అదనంగా పాస్ పుస్తకాలు అందించడం, గత చట్టాల వల్ల వచ్చిన భూ హక్కులను కాల రాస్తూ మరొకరి పేరు మీద భూములు ఎక్కించడం వంటి అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయన్నారు.

తరువాయి 2లో



## గాజుల రామారంలో సీపీఐ రాష్ట్ర మహాసభలు

ఈ కబురు: ఆగస్టు 19వ తేదీ నుండి నాలుగు రోజుల పాటు హైదరాబాద్ కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

» 2లో



## వచ్చే ఐదేళ్లలో 50 ఎయిర్‌పోర్ట్‌లు ఏర్పాటు

దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 50 కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేసి మొత్తం ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్యను 212కు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం (ఐఏటీఏ) వార్షిక సమావేశంలో ఈమేరకు కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రకటన చేశారు. ఈ విస్తరణలో ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం కీలకంగా వ్యవహరిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

దేశం అంతటా ప్రజలకు మరింత చౌకగా, అందుబాటు ప్రాంతాల్లో విమానప్రయాణం చేసేలా ఉడాన్ పథకం సంస్కరణలు తీసుకొస్తోంది. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి 619 కొత్త మార్గాలను నెట్‌వర్క్‌లో జోడించింది. ఇది చిన్న పట్టణాలు, నగరాలకు ప్రత్యక్ష విమాన కనెక్టివిటీని పొందేందుకు దోహదపడుతుంది. విమానాశ్రయాల సంఖ్యను విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించడంతోనే ఇది సాధ్యమవుతుందని మంత్రి చెప్పారు. ప్యాసింజర్ కనెక్టివిటీకి మించి భారత్ గ్లోబల్ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్హాల్ (ఎంఆర్ఓ) హబ్‌గా కూడా నిలదొక్కుకుంటోంది. 2031 నాటికి ఎంఆర్ఓ విభాగం 4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. దేశీయ, అంతర్జాతీయ విమానాల నిర్వహణ అవసరాలను తీర్చే ప్రపంచ స్థాయి సౌకర్యాలను సృష్టించే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ మార్పు విదేశీ మరమ్మతు సేవలపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. భారతదేశ విమానయాన ఆర్థిక వ్యవస్థను పెంచుతుంది.

## ఒక్కసారి ఛార్జి చేస్తే 627 కిలోమీటర్ల ప్రయాణం: టాటా హారియర్ ఈవీ విడుదల..!

**టాటా తన ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ హారియర్ ఈవీని మార్కెట్లోకి లాంచ్ చేసింది. దీనిలో పలు అత్యాధునిక ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.**



టాటా మోటార్స్ తన ఫ్లాగ్‌షిప్ కార్లలో ఒకటైన హారియర్‌లో విద్యుత్తు వేరియంట్‌ను మంగళవారం భారత మార్కెట్లోకి లాంచ్ చేసింది. ఇప్పటికే సోషల్ మీడియాలో విడుదల చేసిన కారు లుక్స్ ఆటోమొబైల్ ప్రియులను ఆకర్షించాయి. విలాసవంతమైన పవర్‌ఫుల్ కార్లలో లభించే పలు ఫీచర్లను వినియోగదారులకు టాటా ఈవీ అందుబాటులోకి తీసుకొచ్చింది. నాలుగు వర్ణాల్లో ఇది అందుబాటులోకి వచ్చింది. వాటిల్లో ఎంపవర్డ్ ఆక్సైడ్, నైనిటాల్ నక్టర్న్, ప్రిస్టైన్ వైట్, ప్యూర్ గ్రే ఉన్నాయి. ఇక పూర్తిగా నలుపు రంగులోని స్టెల్త్ ఎడిషన్ కూడా టాటా విక్రయించనుంది. దీని బ్యాటరీ ప్యాక్‌కు లైఫ్‌టైమ్ వారెంటీ ఉందని టాటా పేర్కొంది. ఈ కారు ఎక్స్ షోరూమ్ ప్రారంభ మోడల్ ధర రూ.21.49 లక్షలగా ప్రకటించింది. ఈ కారు బుకింగ్స్ జులై 2వ తేదీ నుంచి మొదలు పెట్టనున్నట్లు టాటా ప్రతినిధులు తెలిపారు. టాటా హారియర్ ఈవీ 0100 స్పీడును కేవలం 6.3 సెకన్లలో అందుకొని ఈ శ్రేణిలో వేగవంతమైన ఈవీగా నిలిచింది. డ్రిఫ్ట్, బూస్ట్ మోడ్‌లో డ్యూయల్ మోటార్ క్యూడబ్ల్యూడీ (క్వాడ్ వీల్ డ్రైవ్) నాలుగు చక్రాలకు శక్తిని సరఫరా చేస్తుంది. ఇక డ్రైవింగ్‌లో శాండ్, రాక్ క్రాల్, బూస్ట్ మోడ్, ట్రాన్స్‌పరెంట్ మోడ్, ఆఫ్ రోడ్ అసిస్ట్ వంటివి ఆరు రకాల మోడ్‌లు ఉన్నాయి.

ముఖ్యంగా ట్రాన్స్‌పరెంట్ మోడ్‌లో వాహనం కింద రోడ్డును నేరుగా స్క్రీన్‌లో వీక్షించే అవకాశం ఉంది. ఇది ఆఫ్‌రోడ్ ప్రయాణాలకు బాగా ఉపయోగపడుతుంది.


ఒక కారులో నుంచి మరో కారుకు ఛార్జింగ్ చేసుకొనే అవకాశం దీనిలో ఉంది. హారియర్ ఈవీని ఒక్కసారి ఛార్జి చేస్తే 627 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని ఎంఐడీసీ సర్టిఫై చేసింది. సుదూర ప్రయాణాలకు ఇది అనుకూలంగా ఉంటుంది. దీనిని ఫాస్ట్ ఛార్జింగ్‌లో పెడితే కేవలం 15 నిమిషాల్లో 250 కిలోమీటర్లు ప్రయాణానికి సరిపడేలా బ్యాటరీ సిద్ధమవుతుంది. దీనిలో మ్యాప్లస్ ఆటోఈవీ ఇంటిగ్రేషన్తో డ్రైవర్‌కు సమీపంలోని ఛార్జర్స్ తెలుస్తాయి.

ఈ ఎస్‌యూవీలో తొలిసారి 14.5 అంగుళాల శామ్‌సంగ్ నియో క్యూఎల్ఈడీ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను అమర్చారు. దీనిని జేబీఎల్ బ్లాక్ 10 స్పీకర్ సిస్టమ్, డాల్బీ అట్మోస్‌కు అనుసంధానించారు.

ఈ కారులో 540 డిగ్రీ కెమెరా అదనపు ఆకర్షణగా నిలిచింది. బ్లైండ్‌స్పాట్ మానిటరింగ్, 128 జీబీ స్టోరేజీతో బిల్ట్‌ఇన్ డాష్‌కామ్, క్యూఆర్ ఆధారంగా వీడియోలను తిరిగి పొందే అవకాశం కల్పించారు.

ఈ కారులో రిమోట్ ఫీచర్లు కూడా అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఆటోపార్క్ అండ్ సమన్ మోడ్ సాయంతో వాహనాన్ని రిమోట్ పార్కింగ్ చేయించవచ్చు. ఇక స్మార్ట్ ఫోన్, స్మార్ట్ వాచ్, ఎన్ఎఫ్‌సీ కార్డు సాయంతో డిజిటల్ కీ యాక్సెస్ చేయవచ్చు. రిమోట్ స్టార్ట్, రివర్స్ వంటి కూడా దీనిలో ఉన్నాయి.

డ్రైవ్‌పే ఆప్షన్‌ను కూడా టాటా అందుబాటులోకి తీసుకొచ్చింది. టోల్, పార్కింగ్ వంటి సేవలకు దీని ద్వారా చెల్లింపులు చేయవచ్చు.



## ఆల్‌టైం గరిష్ఠాన్ని తాకిన బ్యాంక్ నిఫ్టీ.. నష్టాల్లో ముగిసిన సూచీలు

**దేశీయ స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 636 పాయింట్లు, నిఫ్టీ 174 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల నడుమ ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు ఆరంభంలోనే తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. ఐటీ, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ దీనికి తోడైంది. దీంతో ఆరంభంలో లాభాల్లో కదలాడిన సూచీలు.. చివరకు నష్టాల్లో ముగిశాయి.**

సెన్సెక్స్ ఉదయం 81,492.50 పాయింట్ల (క్రితం ముగింపు 81,373.75) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీ ఇంట్రాడేలో 81,774.23 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ప్రధాన షేర్లలో అమ్మకాలతో డీలా పడిన సూచీ 80,575.09 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 636 పాయింట్ల నష్టంతో 80,737 వద్ద ముగిసింది. నిఫ్టీ 174 పాయింట్ల నష్టంతో 24,542.50 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టీసీఎస్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, ఎన్టీపీసీ, టాటా మోటార్స్, టాటా స్టీల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎంఅండ్ఎం షేరు మాత్రమే లాభపడింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.56 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,355 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**ఆల్‌టైం గరిష్ఠానికి బ్యాంక్ నిఫ్టీ**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ప్రధాన షేర్లు రాణించడంతో బ్యాంక్ నిఫ్టీ ఆల్ టైం గరిష్ఠాన్ని తాకింది. ఉదయం 9:30 గంటల సమయంలో 56,161.40 వద్ద తాజా రికార్డును నెలకొల్పింది. తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో నష్టాల్లోకి జారుకుంది.

**కారణాలు ఇవే..**

కొన్ని రోజులుగా కొనుగోళ్లవైపు మొగ్గుచూపిన విదేశీ సంస్థాగత మదుపర్లు (FII) గత రెండు ట్రేడింగ్ సెషన్ల నుంచి వరుసగా అమ్మకాలకు దిగారు. సోమవారం రూ.2,589 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇది స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి పెంచింది. అంతర్జాతీయ మార్కెట్లలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 0.57 శాతం పెరిగి 65 డాలర్లకు చేరింది. ఒపెక్+ దేశాల నుంచి ఊహించిన దానికంటే తక్కువ ఉత్పత్తి నమోదు కావడం, రష్యాఉక్రెయిన్ యుద్ధ ఆందోళనలు.. వంటివి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీకి సంబంధించిన నిర్ణయాలు జూన్ 6న వెలువడనున్నాయి. గత రెండు సమావేశాల్లో రెపో రేటును ఆర్‌బీఐ తగ్గించింది. మరోసారి కూడా ఈ రేట్లు తగ్గనున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయినప్పటికీ ద్రవ్యోల్బణంపై ఆందోళనలు నెలకొన్నాయి.



## మైక్రోసాఫ్ట్‌లో మరోసారి లేఆఫ్‌లు.. 300 మంది తొలగింపు




**ఏఐ, ఆటోమేషన్ వైపు పయనిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ ఉద్యోగాల కోతల్ని కొనసాగిస్తోంది. తాజా రౌండ్‌లో మరో 300 మందిని తొలగించింది.**

ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల తొలగింపు చర్యలు చేపట్టింది. ఇప్పటికే వేల సంఖ్యలో ఉద్యోగులను ఇంటికి పంపిన సంస్థ.. తాజాగా మరో 300 మందిని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమమేధ వినియోగాన్ని పెంచే దిశగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ లేఆఫ్‌లు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. ఏఐ, ఆటోమేషన్ వైపు పయనిస్తున్న నేపథ్యంలో ఉద్యోగాల కోతలు ప్రారంభించింది. అందులోభాగంగానే గత నెలలో సుమారు 6వేల మందికి ఉద్వాసన పలికింది. అయితే, ఇందులో ఏఐ వ్యవస్థలు రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఎక్కువగా ఉన్నారు. మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలుచేస్తూనే ఉంటామని మైక్రోసాఫ్ట్ ప్రతినిధి తెలిపారు. ఏఐ రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో, వ్యాపార ప్రాధాన్యాలను సమీక్షించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇక.. మైక్రోసాఫ్ట్ తాజా రౌండ్‌లో ఏ ఉద్యోగాలను తొలగించిందో వెల్లడించలేదు.

మైక్రోసాఫ్ట్, మెటా, సేల్స్‌ఫోర్స్ వంటి సంస్థలు మెషిన్ లెర్నింగ్, ఆటోమిషన్ ట్రెండ్‌లకు అనుగుణంగా వర్క్‌ఫోర్స్ వ్యూహాలను అనుసరిస్తున్నాయి. ఏఐ ఆధారిత సాధనాల వినియోగాన్ని పెంచుతున్నాయి. ఖర్చుల్ని తగ్గించడంతో పాటు ఇంజినీరింగ్ బృందాలపై ఆధారపడే అవసరాన్ని తగ్గించుకుంటున్నాయి. దీంతో ఆ విభాగంలోని వారిని తొలగిస్తున్నాయి. ఇటీవల ఏఐ వినియోగంతో తక్కువ ఉద్యోగులతో కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు సేల్స్‌ఫోర్స్ పేర్కొంది. మైక్రోసాఫ్ట్ కూడా తమ ఏఐ కోపైలట్ సాధనాలతో కోడింగ్, ఇతర సాంకేతికత ప్రక్రియలను వేగవతం చేస్తోంది.




## టెక్నాలజీలో రారాజు 'రిలయన్స్'

**అంతర్జాతీయ దిగ్గజ టెక్నాలజీ కంపెనీల్లో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) చోటు దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్‌లో ట్రేడవుతున్న అగ్రగామి 30 కంపెనీల్లో భారత్ నుంచి ఈ ఘనత సాధించిన ఏకైక సంస్థగా రిలయన్స్ నిలిచింది.**

**అగ్రగామి 30 కంపెనీల్లో చోటు**
**మొదటి 8 స్థానాలూ అమెరికావే**
**ట్రెండ్స్-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నివేదిక**

**దిల్లీ:** అంతర్జాతీయ దిగ్గజ టెక్నాలజీ కంపెనీల్లో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) చోటు దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్‌లో ట్రేడవుతున్న అగ్రగామి 30 కంపెనీల్లో భారత్ నుంచి ఈ ఘనత సాధించిన ఏకైక సంస్థగా రిలయన్స్ నిలిచింది. 'ట్రెండ్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' పేరిట ఈ నివేదికను వెలువరించారు. అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీల మార్కెట్ విలువ ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. మొదటి 8 స్థానాల్లో అమెరికా టెక్నాలజీ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ ఉన్నాయి. 9వ స్థానంలో తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ, ఆ తర్వాతి స్థానంలో చైనా సంస్థ టెన్సెంట్ నిలిచాయి. జాబితాలో 216 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.18.4 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ ఇండస్ట్రీస్ 23వ స్థానం దక్కించుకుంది.

**నివేదికలోని పలు అంశాలు ఇలా..**

గత 30 ఏళ్లలో (19952025) కేవలం అయిదు కంపెనీలు మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, సిస్కో, ఐబీఎం, ఎటీ అండ్ టీ మాత్రమే అగ్రగామి 30లో కొనసాగుతున్నాయి. రిలయన్స్‌తో పాటు ఎన్విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా, టెస్లా, అలీబాబా, సేల్స్‌ఫోర్స్, చైనా మొబైల్ కొత్తగా చేరాయి.

అత్యంత విలువైన టెక్ కంపెనీలు 1995లో అమెరికాలో 53% (30లో 16) ఉండగా, 2025లో 70 శాతానికి (30లో 21) చేరాయి. 1995లో జపాన్‌లో 30 శాతం (30లో 9) అగ్రగామి టెక్ కంపెనీలు ఉండగా, 2025లో ఆ సంఖ్య సున్నాకు పడిపోయింది. అప్పట్లో బ్రిటన్, సింగపూర్, హాంకాంగ్, మెక్సికో, మలేసియాల్లో ఒక్కో అగ్రగామి కంపెనీ ఉండగా, ప్రస్తుతం జాబితాలో అవేవీ లేవు.

2025లో జాబితాలో చైనా (3), జర్మనీ (2), తైవాన్ (1), నెదర్లాండ్స్ (1), దక్షిణ కొరియా (1), భారత్ (1) చోటు పొందాయి. తైవాన్ సంస్థ టీఎస్ఎంసీ, ప్రపంచ అధునాతన సెమీకండక్టర్లలో 8090% ఉత్పత్తి చేస్తోంది.

**అంతర్జాతీయ సెమీకండక్టర్లలో ఈ కంపెనీ వాటా 62%.**

ప్రపంచంలో చాట్‌జీపీటీ మొబైల్ యాప్‌కు ఎక్కువ మంది వినియోగదారులు భారత్‌లోనే ఉన్నారు. ఈ యాప్‌నకు 13.5% నెలవారీ క్రియాశీల వినియోగదారులు ఇక్కడ ఉన్నారు. అమెరికా (8.9%), ఇండోనేషియా (5.7%), బ్రెజిల్ (5.4%), పాకిస్థాన్ (3%) తర్వాత ఉన్నాయి. చైనా ఏఐ యాప్ డీప్‌సీక్ అంతర్జాతీయ వినియోగదారుల్లో భారత్‌లో 6.9% మంది ఉండగా, చైనాలో (33.9%), రష్యాలో (9.2%) ఉన్నారు.

## ఆరెంజ్ మూవీ బ్యూటీ పెళ్లి వేడుక.. వ్యాపారవేత్తతో ఏడడుగులు!

ప్రముఖ బాలీవుడ్ నటి షాజన్ పెళ్లి బంధంలోకి అడుగుపెట్టనుంది. ప్రముఖ వ్యాపారవేత్తతో ఏడడుగులు వేయనుంది. వీరిద్దరి గ్రాండ్ వెడ్డింగ్ ఈనెల 5న జరగనుంది. ఈనెల 3న హల్దీ వేడుకతో షాజన్ పదమ్సీ పెళ్లి సందడి మొదలు కానుంది. ఈ ఏడాది జనవరి 20న ఆశిశ్ కనకియాతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్న ముద్దుగుమ్మ.. తాజాగా పెళ్లి చేసుకోనుంది. ఇవాళ సాయంత్రం హల్దీ వేడుకలో పెళ్లి సందడి షూరూ కానుంది.

జూన్ 5న పెళ్లి వేడుక తర్వాత స్నేహితుల, సన్నిహితుల కోసం ముంబయిలో గ్రాండ్‌గా సంగీత్‌తో పాటు రిసెప్షన్ కూడా నిర్వహించనున్నారు. కాగా.. షాజన్ పదమ్సీ, ఆశిశ్ కొన్నేళ్ల పాటు డేటింగ్‌లో ఉన్నారు. ఆ తర్వాత జనవరి 2025లో నిశ్చితార్థం చేసుకున్నారు. ఆమెకు కాబోయే భర్త ఆశిశ్ మూవీమాక్స్ సినిమాస్ సీఈవోగా పనిచేస్తున్నారు.

ఇక షాజన్ సినీ కెరీర్ విషయానికొస్తే హౌస్‌ఫుల్-2 చిత్రంతో బాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకుంది. అంతకుముందు రాకెట్ సింగ్: సేల్స్‌మ్యాన్ ఆఫ్ ది ఇయర్, దిల్ తో బచ్చా హై జీ లాంటి చిత్రాల్లో నటించింది. అంతే కాకుండా తెలుగులో రామ్ చరణ్ నటించిన ఆరెంజ్, వెంకటేశ్ సినిమా మసాలాలోనూ కీలక పాత్రల్లో మెప్పించింది. ఆ తర్వాత తమిళంలోనూ కనిమొజి అనే సినిమాలో కనిపించింది. ఇటీవల జాక్వెలిన్ ఫెర్నాండెజ్ నటించిన వెబ్ సిరీస్ హై జునూన్‌లో నటించింది. ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ పెళ్లి చేసుకుని కొత్త జీవితం ప్రారంభించనుంది.







## బాయ్‌ఫ్రెండ్ బర్త్ డే సెలబ్రేట్ చేసుకున్న ఖుషీ కపూర్!

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ సిస్టర్ ఖుషీ కపూర్ తన ప్రియుడి బర్త్ డేను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంది. బాలీవుడ్ నటుడు వేదాంగ్ రైనాతో డేటింగ్‌లో ఉన్న ముద్దుగుమ్మ జూన్ 2న అతని పుట్టినరోజును కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫోటోలను వీరి స్నేహితురాలు కరీమా బారీ ఇన్‌స్టాలో షేర్ చేశారు. ఈ బర్త్ డే పార్టీలో అనురాగ్ కశ్యప్ కుమార్తె, యూట్యూబర్ ఆలియా కశ్యప్ కూడా పాల్గొన్నారు. కాగా.. వేదాంగ్ రైనా రెండేళ్ల క్రితం ది ఆర్చీస్ (2023)తో హిందీ చిత్ర పరిశ్రమలో నటుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత గతేడాది ఆలియా భట్ కీలక పాత్రలో నటించిన జిగ్రా (2024) మూవీలో కనిపించారు. ఈ చిత్రంలో ఆమె తమ్ముడిగా ప్రేక్షకులను అలరించాడు. ప్రస్తుతం వేదాంగ్ రైనా తన రాబోయే చిత్రంలో అనన్య పాండేతో స్క్రీన్‌ను పంచుకోనున్నారు.

## నా వ్యాఖ్యలను అపార్థం చేసుకోవడం బాధగా ఉంది: 'కేఎఫ్‌సీసీ'కి కమల్‌హాసన్ లేఖ



**కన్నడ భాషపై తాను చేసిన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారని కమల్‌హాసన్ అన్నారు. ఈ మేరకు లేఖ రాశారు.**

రాజ్‌కుమార్ కుటుంబంతో ఉన్న అనుబంధం గురించి మాట్లాడుతూ కన్నడ భాషపై తాను చేసిన వ్యాఖ్యలను అక్కడి వారు అపార్థం చేసుకోవడం బాధగా ఉందని కమల్ హాసన్ అన్నారు. తమది (తమిళ్, కన్నడ ప్రజలు) ఒకే ఫ్యామిలీ అని చెప్పడమే తన ఉద్దేశమని, ఆ భాషను తక్కువ చేయడం కాదని పేర్కొన్నారు. ఈ మేరకు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సీసీ)కి లేఖ రాశారు. కన్నడ.. తమిళ్ నుంచి పుట్టిందంటూ కొన్ని రోజుల క్రితం జరిగిన 'థగ్ లైఫ్' సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌లో కమల్ కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. అవి కన్నడనాట చర్చనీయాంశమయ్యాయి. అధికార, విపక్ష పార్టీలతో పాటు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తీవ్రంగా స్పందించాయి. ఈ క్రమంలోనే.. కమల్ నటించిన 'థగ్ లైఫ్'ని కర్ణాటకలో నిషేధించాలని కోరుతూ కేఫ్‌సీసీ హైకోర్టును ఆశ్రయించింది. విచారించిన హైకోర్టు కమల్ హాసన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని' వ్యాఖ్యానించింది. ఈ పరిణామాల నేపథ్యంలో కమల్ తాజాగా కేఎఫ్‌సీసీకి లేఖ రాశారు.

**శివన్న ఇబ్బందిపడడం విచారకరం: కమల్ హాసన్**

"తమిళంలాగే కన్నడ భాషకు సాంస్కృతిక నేపథ్యం ఉంది. దాన్ని నేను ఆరాధిస్తా. కన్నడిగుల ఆదరణ నా కెరీర్ అంతటా ఉంది. దానికి నేను సంతోషిస్తున్నా. భాష పట్ల నా ప్రేమ నిజమైంది. కన్నడిగులు తమ మాతృభాషను ప్రేమించడాన్ని నేను గౌరవిస్తున్నా. తమిళ్, కన్నడ, తెలుగు, మలయాళం.. ఇలా అన్ని భాషలతోనూ నాకు ఎప్పటి నుంచో అనుబంధం ఉంది. ఒక భాష.. మరో భాషపై ఆధిపత్యం చెలాయించడాన్ని నేను వ్యతిరేకిస్తా. అన్ని భాషలకు సమాన గౌరవం కోసం నిలుస్తా" "నాకు సినిమా భాష తెలుసు. అది యూనివర్సల్ లాంగ్వేజ్. ప్రేమ, అనుబంధం మాత్రమే దానికి తెలుసు. అలా మన మధ్య ఉన్న బంధం గురించే నేను మాట్లాడా. ఈ ప్రేమ, బంధం గురించి నా సీనియర్లు నాకు చెప్పారు. ఆ ప్రేమ, అభిమానంతోనే శివన్న (శివరాజ్‌కుమార్) ఆడియో విడుదల వేడుకకు హాజరయ్యారు. ఈ పరిణామాల వల్ల ఆయన ఇబ్బందిపడడం విచారకరం. ఏది ఏమైనా మా బంధం ఎప్పటికీ ఇలాగే ఉంటుందని చెప్పగలను. సినిమా.. ప్రజల మధ్య వారధిలాంటిది. వేరు చేసే గోడలాంటిది కాదు. అశాంతి, శత్రుత్వాన్ని నేనెప్పుడూ కోరుకోను" అని కమల్‌హాసన్ పేర్కొన్నారు. కమల్ హీరోగా మణిరత్నం తెరకెక్కించిన 'థగ్ లైఫ్' ఈ నెల 5న విడుదల కానుంది.



## నాగ్‌చిరు అయిపోయారు.. ఇప్పుడు ఆ హీరోతో?

టాలీవుడ్‌లో హీరోయిన్లకు కొదవలేదు. ముంబై నుంచే కాకుండా కన్నడ, మలయాళ నుంచి ఎప్పటికప్పుడు యంగ్ హీరోయిన్లు వస్తూనే ఉంటారు. అలానే కొన్నాళ్ల క్రితం తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన కన్నడ భామ ఆషికా.. ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' సినిమాలో చేస్తోంది. ఇప్పుడు మరో స్టార్ హీరో చిత్రంలో ఛాన్స్ కొట్టేసినట్లు తెలుస్తోంది.

కల్యాణ్ రామ్ 'అమిగోస్' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆషికా.. నాగార్జున 'నా సామి రంగ'లోనూ హీరోయిన్‌గా చేసి గుర్తింపు తెచ్చుకుంది. అలా చిరంజీవి 'విశ్వంభర'లో ఛాన్స్ కొట్టేసింది. ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. మరికొన్ని నెలల్లో రిలీజ్ కావొచ్చు. ఇప్పుడు రవితేజ కొత్త సినిమాలోనూ ఆషికాని తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం 'మాస్ జాతర' చేస్తున్న రవితేజ.. దీని తర్వాత దర్శకుడు కిశోర్ తిరుమల తీసే సినిమాలో నటించబోతున్నాడు. ఈ చిత్రానికి 'అనార్కలి' అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. తొలుత ఈ మూవీ కోసం కాయదు లోహర్, మమిత బైజు పేర్లు పరిశీలనలోకి వచ్చినప్పటికీ... ఇప్పుడు ఆ స్థానాల్లో కేతిక శర్మ, ఆషిక రంగనాథ్ ఉండబోతున్నారని తెలుస్తోంది. కిశోర్ తిరుమల సినిమాలంటే హీరోయిన్ల పాత్రకు కాస్త గుర్తింపు ఉంటుంది. మరి ఈసారి ఆషికాని ఎలా చూపిస్తాడో? త్వరలో ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టి.. వచ్చే సంక్రాంతికి లేదా వేసవికి రిలీజ్ చేయాలని ప్లాన్‌లో టీమ్ ఉంది.

## అడివి శేష్ పాన్ ఇండియా మూవీ .. ఫైర్ థీమ్ రిలీజ్




అడివి శేష్ నటిస్తోన్న తాజా చిత్రం 'డకాయిట్'. ఈ సినిమాకు షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. అడివి శేష్ నటించిన క్షణం, గూఢచారితో సహా పలు తెలుగు సినిమాలకు కెమెరామెన్‌గా చేసిన షానీల్ డియో ఈ మూవీతో డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. ఇందులో అడివి శేష్ సరసన హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటించింది. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన ఫైర్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. తాజాగా ఈ మూవీ నుంచి ఫైర్ థీమ్(ఒరిజినల్ సౌండ్ ట్రాక్) రిలీజ్ చేశారు. ఈ ఫైర్ థీమ్‌ను భీమ్స్ సిసిరోలియో పవర్‌ఫుల్‌గా కంపోజ్ చేశారు. ఇక ఆడియన్స్‌కి ఒక మ్యూజికల్ ఫీస్ట్ ఎక్స్ పీరియన్స్ ఇస్తోంది. అన్ని మ్యూజిక్ ప్లాట్‌ఫామ్‌లో టాప్‌లో ట్రెండ్ అవుతోంది. ఇటీవలే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ చిత్రం ఈ క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న థియేటర్లలో విడుదల కానుంది.

# 18 ఏళ్ల నిరీక్షణకు తెర.. ఐపీఎల్‌లో ఆర్సీబీకి తొలి టైటిల్











**ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ తొలి టైటిల్ సాధించింది.**

**అహ్మదాబాద్:** ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేరింది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ తొలి టైటిల్ సాధించింది. పంజాబ్ కింగ్స్ తో జరిగిన ఫైనల్‌లో 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. శశాంక్ సింగ్ (61*; 30 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) పోరాడినా పంజాబ్‌కు ఓటమి తప్పలేదు. పంజాబ్ బ్యాటర్లలో జోష్ ఇంగ్లిస్ (39; 23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (26), ప్రియాంశ్ ఆర్య (24), నేహల్ వధేరా (15) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 2, కృనాల్ పాండ్య 2, హేజిల్‌వుడ్, రొమారియో షెఫర్డ్, యశ్ దయాళ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

**ఆరంభం బాగున్నా..**

లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ నిలకడగా బౌండరీలు బాది తొలి వికెట్‌కు 43 పరుగులు జోడించారు. హేజిల్‌వుడ్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ ఇచ్చిన క్యాచ్‌ను రొమారియో షెఫర్డ్ అందుకోలేకపోయాడు. హేజిల్ వుడ్ వేసిన ఐదో ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదిన ప్రియాంశ్.. చివరి బంతికి ఔటయ్యాడు. బౌండరీ లైన్ వద్ద ఫిల్ సాల్ట్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో ప్రియాంశ్ వెనుదిరిగాడు. పవర్ ప్లే ముగిసేసరికి పంజాబ్ 52/1తో నిలిచింది. సుయాశ్ శర్మ వేసిన 8వ ఓవర్‌లో జోష్ ఇంగ్లిస్ రెండు సిక్స్‌లు కొట్టాడు. కృనాల్ వేసిన తొమ్మిదో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్.. భువీకి క్యాచ్ ఇచ్చాడు. తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్ (1)ని రొమారియో షెఫర్డ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ జితేశ్‌కు చిక్కాడు. జోష్ ఇంగ్లిస్ దూకుడుగా ఆడటంతో 12 ఓవర్లకు పంజాబ్ 98/3తో మెరుగైన స్థితిలో కనిపించింది.

అయితే, తర్వాతి ఓవర్‌లోనే ఇంగ్లిస్‌ను కృనాల్ వెనక్కి పంపాడు. నేహల్ వధేరా (15), మార్కస్ స్టాయినిస్ (6) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. అయితే, చివర్లో శశాంక్ సింగ్ దూకుడుగా ఆడాడు. భువనేశ్వర్ 19 ఓవర్‌లో సిక్స్, ఫోర్ బాదాడు. హేజిల్‌వుడ్ 20వ ఓవర్‌లో విజయ సమీకరణం 29 కాగా.. తొలి రెండు బంతులు డాట్ అయ్యాయి. తర్వాత దీంతో ఆర్సీబీ విజయం ఖరారైపోయింది. చివరి నాలుగు బంతులకు శశాంక్ వరుసగా 6, 4, 6, 6 బాదినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆర్సీబీ తొలిసారి ఛాంపియన్‌గా అవతరించింది.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ.. బ్యాటర్లలో విరాట్ కోహ్లీ (43; 35 బంతుల్లో 3×4) రాణించాడు. ఫిల్ సాల్ట్ (16; 9 బంతుల్లో 2×4, 1×6) మయాంక్ అగర్వాల్ (24; 18 బంతుల్లో 2×4,1×6), రజత్ పాటిదార్ (26; 16 బంతుల్లో 1×4, 2×6), లివింగ్‌స్టన్ (25; 15 బంతుల్లో 2×6), రొమారియో షెఫర్డ్ (17;9 బంతుల్లో 1×4; 1×6) కీలక ఇన్నింగ్స్ ఆడారు. జితేశ్ శర్మ (24; 10 బంతుల్లో 2×4, 2×6) మెరుపులు ఆకట్టుకున్నాయి. పంజాబ్ బౌలర్లలో జెమీసన్, అర్ష్‌దీప్ సింగ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా అజ్మతుల్లా, యుజ్వేంద్ర చాహల్, విజయ్‌కుమార్ తలో వికెట్ తీశారు.



## ఇంగ్లండ్‌కు బయల్దేరిన కేఎల్ రాహుల్

త్వరలో ప్రారంభం కానున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టాడు. రాహుల్ నిన్ననే ముంబై నుంచి లండన్‌కు బయల్దేరాడు. రాహుల్ లండన్‌లోని హీథ్రూ విమానాశ్రయంలో ల్యాండైన దృశ్యాలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

రాహుల్ ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ లయన్స్‌తో నాలుగు రోజుల అనధికారిక టెస్ట్ మ్యాచ్ ఆడతాడు. ఈ మ్యాచ్ కోసమే రాహుల్ చాలా ముందుగా లండన్‌లో ల్యాండయ్యాడు. ఈ మ్యాచ్ జూన్ 6న ప్రారంభం కానుంది. నార్తంప్టన్ వేదికగా జరుగనుంది. ఈ మ్యాచ్ కోసం తనను ముందుగానే ఇంగ్లండ్‌కు పంపాలని రాహుల్ బీసీసీఐకి ప్రత్యేక విజ్ఞప్తి చేశాడు. భారత్‌లో వాతావరణం ప్రాక్టీస్‌కు అనువుగా లేదని, అందుకే తనకు లయన్స్‌తో మ్యాచ్ ఆడే అవకాశం ఇవ్వాలని రాహుల్ బీసీసీఐని కోరాడు. రాహుల్ కోరిక మేరకు బీసీసీఐ అతన్ని ముందుగానే లండన్‌కు పంపింది.

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు భారత్-ఏ జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు నాలుగు రోజుల అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్ నిన్ననే ముగిసింది. ఈ మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆటగాళ్లకు మంచి బ్యాటింగ్ ప్రాక్టీస్ లభించింది. ఇంగ్లండ్ సిరీస్‌కు ఎంపికైన కరుణ్ నాయర్ డబుల్ సెంచరీతో చెలరేగాడు. తొలి ఇన్నింగ్స్‌లో సర్ఫరాజ్ ఖాన్, ధృవ్ జురెల్ తృటిలో సెంచరీలు మిస్ అయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్, కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్, ధృవ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి అర్ధ సెంచరీలతో రాణించారు.

లయన్స్‌తో రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ తర్వాత భారత జట్టు ఓ ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతుంది. ఈ మ్యాచ్ జూన్ 13 నుంచి 16 వరకు జరుగుతుంది. అనంతరం జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ కోసం శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టు జూన్ 5వ తేదీ తర్వాత లండన్‌కు బయల్దేరుతుంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో ఈ సిరీస్‌కు ముందే గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ సిరీస్‌కు ముందే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి కూడా టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు.


ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్, యశస్వి జైస్వాల్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, ధృవ్ జురెల్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్, ఆకాశ్‌దీప్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్

ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ షెడ్యూల్..

జూన్ 20-24- తొలి టెస్ట్ (లీడ్స్)
జులై 2-6- రెండో టెస్ట్ (బర్మింగ్హమ్)
జులై 10-14- మూడో టెస్ట్ (లార్డ్స్ )
జులై 23-27- నాలుగో టెస్ట్ (మాంచెస్టర్)
జులై 31-ఆగస్ట్ 4- ఐదో టెస్ట్ (కెన్నింగ్‌స్టన్ ఓవల్)

## వేలంలో అన్‌సోల్డ్.. రిటైర్మెంట్ ప్రకటించిన పర్దీప్ నర్వాల్



**కబడ్డీ లెజెండ్, స్టార్ రైడర్ పర్దీప్ నర్వాల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. హర్యానాకు చెందిన పర్దీప్ నర్వాల్.. ప్రొఫెషనల్ కబడ్డీకి రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రో కబడ్డీ లీగ్ 2025 వేలంలో అమ్ముడుపోకపోవడంతో పర్దీప్ ఈ నిర్ణయం తీసుకున్నాడు.**

స్పోర్ట్స్ బ్రాడ్‌కాస్టర్ సునీల్ తనేజాతో ఇంటారక్షన్‌లో పర్దీప్ ఈ షాకింగ్ న్యూస్‌ను వెల్లడించాడు. కోచ్‌గా తన కొత్త అవతరామెత్తనున్నట్లు నర్వాల్ తెలిపాడు. ప్రో కబడ్డీ లీగ్ చరిత్రలో పర్దీప్ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాడు. పాట్నా పైరేట్స్ వరుసగా మూడు పీకెఎల్ టైటిల్‌స్‌ను గెలవడంలో నర్వాల్‌ది కీలక పాత్ర.

అదేవిధంగా ప్రోకబడ్డీ లీగ్ హిస్టరీలో అత్యధిక రైడ్ పాయింట్లు సాధించిన రికార్డు కూడా నర్వాల్ పేరిట ఉంది. ఈ హర్యానా ఆటగాడు పీఎకెల్‌లో 190 మ్యాచ్‌లు ఆడి 1801 పాయింట్లు సాధించాడు. మ్యాచ్‌కు సగటున 9.47 రైడ్ సాధించడం విశేషం.

అయితే గత నాలుగు సీజన్లలో పర్దీప్ తన ఫామ్‌ను కోల్పోయి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. యుపి యోధాస్, బెంగళూరు బుల్స్ తరఫున నర్వాల్ పెద్దగా రాణించలేకపోయాడు. కాగా గతంలో భారత కబడ్డీ జట్టుకు కూడా నర్వాల్ ఆడాడు.



## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి

**పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ మధ్య అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఇవాళ (జూన్ 3) జరుగుతున్న ఐపీఎల్ 2025 ఫైనల్లో రికార్డుల రారాజు విరాట్ కోహ్లి చరిత్ర సృష్టించాడు.**

ఈ మ్యాచ్‌లో మూడు ఫోర్లు బాదిన విరాట్.. క్యాష్ రిచ్ లీగ్ చరిత్రలో అత్యధిక బౌండరీలు సాధించిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఈ రికార్డు శిఖర్ ధవన్ పేరిట ఉండేది. ఐపీఎల్‌లో శిఖర్ 768 బౌండరీలు బాదగా.. విరాట్ ఈ మ్యాచ్‌లో ఆ మార్కును క్రాస్ చేశాడు. ప్రస్తుతం విరాట్ ఖాతాలో 770 బౌండరీలు ఉన్నాయి.

**ఐపీఎల్ చరిత్రలో అత్యధిక బౌండరీలు బాదిన టాప్-5 ఆటగాళ్లు..**

**విరాట్ కోహ్లి- 770 (267 ఇన్నింగ్స్‌లు)**
**శిఖర్ ధవన్-768 (222)**
**డేవిడ్ వార్నర్-663 (184)**
**రోహిత్ శర్మ-640 (272)**
**అజింక్య రహానే-514 (172)**

**భారీ రికార్డును మిస్ చేసుకున్న విరాట్**

ఈ మ్యాచ్‌లో విరాట్ మరో భారీ రికార్డు సొంతం చేసుకునే అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో విరాట్ 86 పరుగులు చేసుంటే, ఐపీఎల్ చరిత్రలో మూడు సీజన్లలో 700 పరుగుల మార్కును తాకిన తొలి ఆటగాడిగా సరికొత్త చరిత్ర సృష్టించేవాడు. అయితే విరాట్ 43 పరుగులకే ఔట్ కావడంతో ఈ సీజన్‌లో అతని పరుగుల సంఖ్య 657 పరుగుల వద్ద ఆగిపోయింది. విరాట్ 2016 సీజన్‌లో 973 పరుగులు, 2024 సీజన్‌లో 741 పరుగులు చేశాడు. ప్రస్తుతం విరాట్‌తో పాటు క్రిస్ గేల్ ఒక్కడే రెండు సీజన్లలో 700 పరుగుల మార్కును తాకిన ఆటగాడిగా ఉన్నాడు. గేల్ వరుసగా 2012, 2013 సీజన్లలో ఈ ఘనత సాధించాడు.

ఫైనల్ మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ 15 ఓవర్లు పూర్తయ్యేసరికి 4 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. లివింగ్‌స్టోన్ 16, జితేశ్ శర్మ 1 పరుగుతో క్రీజ్‌లో ఉన్నారు. సాల్ట్ 16, విరాట్ కోహ్లి 43, మయాంక్ అగర్వాల్ 24, రజత్ పాటిదార్ 26 పరుగులు చేసి ఔటయ్యారు. పంజాబ్ బౌలర్లలో జేమీసన్ 2, ఒమర్‌జాయ్, చహల్ తలో వికెట్ తీశారు.

## కార్ల్‌సన్‌కు గుకేశ్ షాక్

**క్లాసికల్ ఫార్మాట్‌లో తొలిసారి ప్రపంచ నంబర్‌వన్‌పై నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్**

**స్టావెంజర్:** మాగ్నస్ కార్ల్‌సన్... చెస్ గురించి తెలిసిన వారికి, క్రీడాభిమానులకూ సుపరిచితమైన పేరు... ప్రపంచ చదరంగంలో అతను 14 ఏళ్లుగా వరల్డ్ నంబర్‌వన్‌గా కొనసాగుతున్నాడు ... క్లాసికల్ ఫార్మాట్‌లో ఐదుసార్లు... ర్యాపిడ్ ఫార్మాట్‌లో ఐదుసార్లు... బ్లిట్జ్ ఫార్మాట్‌లో ఏకంగా ఎనిమిదిసార్లు విశ్వవిజేతగా నిలిచాడు. ఏమాత్రం చిన్న అవకాశం దొరికినా ఓటమి అంచుల్లో నుంచి విజయాన్ని అందుకోవడంలో దిట్ట. ఇలాంటి అసాధారణ నైపుణ్యమున్న ప్లేయర్‌తో గేమ్ ఆడుతూ 'డ్రా' చేసుకుంటే అది విజయంతో సమానం. ఇక నేరుగా గెలిస్తే అది పెద్ద సంచలనమే అవుతుంది.అలాంటి సంచలనమే నమోదు చేశాడు భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్. ఆరుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న నార్వే ఓపెన్ టోర్నిలో కార్ల్‌సన్‌పై గుకేశ్ చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని... తన కెరీర్‌లో తొలిసారి క్లాసికల్ గేమ్‌లో కార్ల్‌సన్‌పై గెలిచాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఆరో రౌండ్ గేమ్‌లో 19 ఏళ్ల గుకేశ్ తెల్ల పావులతో ఆడుతూ 62 ఎత్తుల్లో కార్ల్‌సన్ ఆట కట్టించాడు.నాలుగు గంటలపాటు జరిగిన ఈ గేమ్‌లో కార్ల్‌సన్ 52వ ఎత్తులో చేసిన తప్పిదాన్ని గుకేశ్ అనుకూలంగా మల్చుకొని సంచలన ఫలితం సాధించాడు. తనను 'ఢీ'కొట్టే సరైన ప్రత్యర్థులు లేకపోవడంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌పై ఆసక్తి కోల్పోయి కొన్నాళ్లుగా ఆ మెగా ఈవెంట్‌కు దూరంగా ఉంటున్న 34 ఏళ్ల కార్ల్‌సన్‌కు... భవిష్యత్‌లో గట్టి ప్రత్యర్థి కాగల సత్తా తనలో ఉందని గుకేశ్ నిరూపించుకున్నాడు.




**అసహనంతో...**

గుకేశ్ చేతిలో తొలిసారి ఓటమి చవిచూసిన కార్ల్‌సన్ పరాజయ భారాన్ని తట్టుకోలేకపోయాడు. ఊహించనిరీతిలో స్పందించాడు. తన నుంచి జరిగిన ఒక్క తప్పిదాన్ని అనుకూలంగా మల్చుకొని గుకేశ్ గెలుపు బాట పట్టడంతో కార్ల్‌సన్ ఆ కోపాన్నంతా తాము ఆడిన చెస్ బోర్డు టేబుల్‌పై చూపించాడు. తన పిడికిలితో ఒక్కసారిగా టేబుల్‌పై కార్ల్‌సన్ గట్టిగా కొట్టాడు. ఆ వెంటనే తమాయించుకున్న కార్ల్‌సన్ పావులను చెస్ బోర్డుపై అమర్చి... గుకేశ్‌కు వద్దకు వెళ్లి రెండుసార్లు సారీ చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కార్ల్‌సన్‌ను ఓడించిన తర్వాత గుకేశ్ కొన్ని క్షణాలపాటు షాక్‌లో ఉండిపోయి ఆ తర్వాత ఈ విజయాన్ని ఆస్వాదించాడు. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్ 8.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు.